
కథ

# ముక్తి

- వలివేటి నాగచంద్రావతి



ఫెటేల్ ఫెటేలున ఆకాశం బద్దలు చేసుకుని వికృత ఆకారమొకటి మీదిమీది కొస్తున్న అనుభూతి.

ఉలిక్కిపడుతూ నిద్ర లేచారు విశ్వేశ్వరం గారు. 'అబ్బ, ఎంత భయంకరమైన కల!' చెమటపట్టిన నుదురును తువ్వాలుతో అద్దుకునేటంతలో తిరిగి దడదడ చప్పుడు. అర్థమయింది- కలలో వినిపించింది ఈ తలుపు చప్పుడే అని. తలెత్తి గోడ గడియారం వంక చూశారు. అయిదు దగ్గరుంది చిన్నముల్లు. తెల్లవార వస్తోంది.

పక్క మంచంమీద పడుకున్న అరుంధతమ్మకూ మెలకువొచ్చినట్టుంది - "లేచారా..? తలుపు తట్టినట్టుంది కదూ" అంది.

"ఊ, నేను చూస్తా... పడుకో" మంచం మీంచి లేస్తూ అన్నారు విశ్వేశ్వరం గారు.

రాత్రంతా కలతనిద్రే ఇద్దరికీ. ఇప్పుడిప్పుడే కాస్త బాగా కునుకుపట్టింది. నిట్టూరుస్తూ పక్కకి ఒత్తిగిల్లింది అరుంధతమ్మ.

వీధి తలుపు తీశారు విశ్వేశ్వరం గారు. ఎదురుగా నిలబడి ఉంది - జీర్ణావస్థలో ఉన్న ఓ ఆకారం. కళ్ళు చిట్లించి చూస్తూ ఉండగానే తూలుతూ తూలుతూ కుప్పలా ఆయన కాళ్ళ ముందు ఒరిగిపోయిందా శరీరం.

"ఎవరూ?" తత్తరపాటు, '... కాదు గదా!' అన్న సంశయం, 'కాకూడదు భగవాన్' అన్న విన్నపం.

"నాన్నా" మూలుగులాంటి ఆ పిలుపుతో మసగ తొలగింది. వద్దనుకున్నదే నిజమని స్పష్టమైపోయింది.

"యమునా!" విశ్వేశ్వరం గారి గొంతు సన్నగా వణికింది. అప్రయత్నంగా ముందుకి వంగి పాదాలవద్ద పడి ఉన్న ఆ ఆకారాన్ని సంకోచిస్తూనే తాకారు. ఒక్కమాటుగా ఒళ్ళు జలదరించిపోయిందాయనకి.

'ఈ మాంసపుముద్ద కంటిపాపలా చూసుకున్న తమ కన్నబిడ్డా!' ఇంతకాలంగా పేరుకున్న కోపం, ఆవేశం, తిరస్కారం, విరక్తి... ఏమయిపోయాయో తెలీదు. "తల్లీ!" అంటూ బాణం ములికి తగిలిన పిట్టకుమల్లే విలవిల్లాడిపోయారు.

ఎలాగో చేతులమీద ఎత్తుకుని లోపల మంచంమీదకి చేర్చారు.

ఆ పక్కనే కూలబడిపోయింది అరుంధతమ్మ. "చివరకు ఏ గతిపట్టిందే నీకు" చివికి శిదిలమయిపోయిన చిత్తరువులా పడి ఉన్న కూతురి మొహాన్ని తడుముతూ కుమిలింది.

* * *

ఏముంది మామూలు కథే- అనగా అనగా ఓ యమున. పున్నాగ పువ్వులాంటి అందం. చంద్రకాంత సుమంలాంటి సౌకుమార్యం. తేనెలూరుతోన్న పదహారేళ్ళప్రాయం. వీటన్నిటికీ తోడు మరో ప్లస్సు- చేతికి అందేటట్టున్న దిగువ మధ్యతరగతి అంతస్తు. మరుపాలకేం కొరత... మూగేవీ, ముసిరేవీ, కొసిరేవీ.

మొదట్లో అమ్మా నాన్నల హద్దుల్లో ఉండే ముద్దరాలే యమున... అమ్మ చెప్పినట్టు- ఇంటి దగ్గర దించిన తల కాలేజీదాకా ఎత్తేదే కాదు. 'నిన్ను చూపుల్తో గుచ్చే కీటకాల కొండేల్లో విషముంటుంది సుమా' అన్నెప్తే, 'అవునా' అన్నట్టు బితుకు బితుగ్గా చూసేది.

అలాంటి యమున ఎప్పుడు మారిందో, ఎందుకు మారిందోగానీ మారిపోయింది. 'నువ్వో అపురూప సౌందర్యరాశివి' అని పదేపదే పొగిడే అద్దంలో ప్రతిబింబం, ఆమెలో కొత్త ఆలోచనలకు తెర తీసిందనుకోవాలి. 'ఇంత అందం ముందు ఎన్ని భ్రమరాలైనా గిరికీలు కొట్టాల్సిందే' అనుకోవటం మొదలు పెట్టింది అమాయకంగా. ఆ అతిశయం ఆ అమ్మాయి బుద్ధిని మందగించేసింది.

యమునిప్పుడు తనంటే వెంపర్లాడే అబ్బాయిల్ని చూసి భయపడ్డం మానేసింది. ఎక్కడ కాటేస్తారో అని దూరం పరిగెట్టడం లేదు. 'నా అందానికున్న ప్రభావం అదీ- ఏం చేస్తారు మరీ' అని లోలోపల గర్వపడుతోంది, మురిసిపోతోంది. కనీ కనిపించని మందహాసాలు వెదజల్లుతోంది. తన గాలి తగిల్తే చాలని తన చుట్టూరా ప్రదక్షిణాలు చేసే రోమియోల భక్తికి తట్టుకోలేక 'పోన్లే పాపం' అని కొనకంటి చూపుల వరాలిచ్చేస్తోంది.

'ఏదో ముచ్చటగా మురిపిస్తున్నాను. సరదాగా కవ్విస్తున్నాను' అనుకున్నదేగానీ తానే ఓ ఆకర్షణా వలయం వైపు జరుగుతున్నానని తెలుసుకోలేదు యమున.

ఒక బలహీన క్షణాన 'నువ్వే నా ప్రాణం', 'నువ్వు లేక నేను లేను', 'నిన్ను అందలం ఎక్కిస్తాను', 'పెళ్ళి పారిపోయి చేసుకుంటున్నాం... రిసెప్షన్ అందరితో కలిసి చేసుకుందాం'... ఈ డైలాగుల్ని నిజమే చెబుతున్నాడని నమ్మించగలిగిన ఒక వంచకుడి వలలో చిక్కుకుపోయింది.

ఇల్లు దాటింది. ఊరు దాటింది. చేతులు మారింది. నిస్సహాయంగా నలిగింది. చిరిగింది. పనికిరాకుండా పాడైపోయిందని విసిరిపారేశాక తనకోసం కన్నీరు విడువగల ఆప్తనేత్రం కోసం చల్లనైన అమ్మ ఒడికోసం పోయేపోయే ప్రాణాల్ని ఉగ్గపట్టుకుని బతికున్న శవంలా ఇల్లు చేరింది.

* * *

'ఒక్కగానొక్క బిడ్డవని అల్లారుముద్దుగా పెంచుకున్నాం. పంచప్రాణాలూ నీమీదే పెట్టుకు బతికాం. మమ్మల్నొదిలి ఎలా వెళ్ళగలిగావు... ఏం బావుకుందామని?' పారిపోయిన కూతురు కనిపిస్తే అడుగుదామనుకున్నవన్నీ మనసులో మెదులుతోంటే తల మొత్తుకుంటూ ఏడుస్తోంది అరుంధతమ్మ. 'ఈ ముసలి కాలాన మాకింత శిక్ష వేయటం న్యాయమా భగవంతుడా' అని ఆ కనిపించనివాళ్లే నిలేస్తోంది.

భార్య పక్కనే మాటలు రానివాడిలా కూలబడి ఉన్నారు విశ్వేశ్వరంగారు. ఒక చేయి మాత్రం కూతురు తల నిమురుతోంది అప్రయత్నంగా. 'ఎలా ఉండేది నా బంగారు తల్లి... ఎలా అయిపోయింది. చర్మం తొడిగిన ఎముకలగూడు. ఒళ్ళంతా పుళ్ళు. ఎక్కడెక్కడో వాతలు. పీచులాంటి జుట్టు... అది కూడా నాలుగు పోచలు. కమిలిపోయిన చర్మం. కుందనపు బొమ్మలా ఉండే నా బిడ్డేనా ఇది?' ఉబికి ఉబికి కన్నీళ్లొస్తున్నాయి ఆయనకి.

నొప్పులకి గావునుతాళలేక యమున 'అమ్మా' అంటున్నప్పుడల్లా కడుపులో పేగులు ఉండ చుట్టుకున్నంత బాధ ఇద్దరికీ.

ఉన్నట్టుండి అప్పుడే మెలకువొచ్చినట్టు అన్నారు విశ్వేశ్వరంగారు. "అమ్మాయిని జాగ్రత్తగా చూస్తూండు అరుంధతీ. డాక్టర్ని పిలుచుకొస్తానిప్పుడే" అంటూ లేవబోయారు.

"వద్దు నాన్నా" యమున కళ్ళు తెరిచింది. అతి కష్టం మీద చేయి చాపి తండ్రిని ఆపుతూ, "నన్ను వదిలి వెళ్ళకండి నాన్నా. నేను వెళ్ళిపోవటానికి ఇక ఆట్టే సమయం లేదు" అంది బలహీనంగా.

హొల్లుమంది అరుంధతమ్మ. కండువాతో కళ్ళొత్తుకుంటూ చతికిలపడిపోయారు విశ్వేశ్వరంగారు.

గంట తరవాత తల్లిదండ్రుల ఒడిలో ప్రశాంతంగా తన కష్టాలకీ బాధలకీ ఫుల్‌స్టాప్ పెట్టుకుంది యమున.

ప్రాణాలు వదిలేదాకా ఓపిక కూడగట్టుకుని ఒక్కొక్క అక్షరాన్నే అతి ప్రయాసతో పలుకుతూ తనను వేటాడిన మనుషుల్ని పోలిన రాక్షసుల గురించీ, తననుభవించిన నరకం గురించీ, పొర్లాడించిన రొచ్చుగుంటల గురించీ, కుక్కలా చింపేసిన విస్తరిలా మిగిలిపోయిన తన జీవితం గురించీ చెప్తూనే ఉంది.

కూతురి శవాన్ని భూశయనం చేసి దీర్ఘ నిశ్వాసం విడిచారు విశ్వేశ్వరంగారు.

'పెళ్ళీ పేరంటం చేసుకుని ఈ చేతులకి మనుమలనందిస్తావనుకున్నాం. కట్టెవయి నువ్వే చేతుల్లోకొస్తావనుకోలేదు. ఎంత పాపం చేశామో...' కళ్ళు తుడుచుకున్నారాయన.

'అయిపోయింది. చీరె సారెతో పల్లకి ఎక్కించి అత్తవారింటికి కాదు - ఏడుకట్ల సవారీ మీద వల్లకాటికి పంపాలి. తప్పదు. కనీసం ఈ ఉత్తరక్రియలన్నా సవ్యంగా జరపాలి. తండ్రిగా అది తన ప్రస్తుత కర్తవ్యం' చిటుక్కు తెచ్చుకున్నారు విశ్వేశ్వరంగారు.

కానీ, తను సంకల్పించింది అంత సులువైన వ్యవహారం కాదని ఇంకొద్ది సేపట్లోనే అనుభవమైపోయిందాయనకి. ఉన్న ఊళ్ళోనే బంధువులున్నారు, స్నేహితులున్నారు. అందరికీ ఫోన్లు చేశారు. వాళ్ళకోసం గంటల తరబడి ఎదురు చూశారు. ఎవ్వరూ రాలేదు.

యమున వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ బంధువుల నుంచి ఈ నిరాదరణ ఎదురవుతూనే ఉంది. దాదాపు వెలివేసినట్టే ఉంటున్నారందరూ.

'ఇప్పుడేమిటి చెయ్యటం? ఈ విపత్కర పరిస్థితిని తానొక్కడే ఎలా దాటగలడు?' బేలగా అనుకున్నారు విశ్వేశ్వరంగారు.

ఆయనకి నీలకంఠం గుర్తుకి వచ్చాడు.

తలుచుకోవటమేమిటి- అతను ఆదరా బాదరా రానే వచ్చాడు 'కబురందేసరికి ఆలస్యమయిం'దంటూ.

విశ్వేశ్వరంగారూ అతనూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్న చిరుద్యోగులు. వయసులో ఇద్దరికీ తేడా ఉన్నా 'విశ్వేశ్వరంగారు నా మిత్రుడు' అని చెప్పుకునేది అతనే. నా అన్నవారెవరూ లేరతనికి.

ఆయనది ఇంకో కథ. నీలకంఠం పెళ్ళయిన నాలుగోరోజునే వధువు మరణించిందట. చాలాకాలం అతనికి మళ్ళీ పిల్లనివ్వటానికి ఎవరూ ముందుకురాలేదు. అతని జన్మనక్షత్రం మంచిది కాదన్నారు. పెళ్ళాన్ని మింగే లగ్నాన పుట్టాడన్నారు. ఎన్నాళ్ళ తరవాతో కొంతమంది అమ్మాయిల తండ్రులు తెగించి శాంతులూ జపాలూ గట్రా చేయించుకుంటే పిల్లనిస్తామని బేరం పెట్టారటగానీ, 'మీ అంధ విశ్వాసాలకు నిరసనగా నా పెళ్ళిని నేనే తిరస్కరిస్తున్నాను, పొమ్మన్నాడట' నీలకంఠం.

అన్నట్టుగానే ఇప్పటిదాకా ఒంటరిగానే ఉండిపోయాడు. ఎవరితోనూ పెద్దగా కలిసే మనిషి కాదతను. విశ్వేశ్వరంగారు అతి మేధకుడు. ఎవరి వ్యక్తిగత విషయాల జోలికీ పోడు. అంచేత ఆయనతో మాత్రమే సన్నిహితంగా ఉంటాడు. తనకంటే పెద్దవాడే అయినా ఆ తేడా చూపించడు.

ముఖ్యంగా స్వప్నసౌధాల మీద ఆశతో యమున ఎగిరిపోయినప్పుడు పనిలేని జనాలు 'విశ్వేశ్వరంగారి కూతురు లేచిపోయిం'దంటూ ఆయన వెనకాలే మాటలతో మనసుని కుళ్ళబొడిచి వినోదిస్తున్నప్పుడు, బయటకు మొహం చూపించలేక భార్యాభర్తలిద్దరూ లోలోపలే కుంగిపోతున్నప్పుడు మనస్ఫూర్తిగా సానుభూతి చూపించి ఓదార్చినవాడు నీలకంఠం. 'కాకులయ్యా వాళ్ళు విశ్వం. పుండుని కెలకటం వాళ్ళ



నైజం. నీ బాధ కనిపించనిచ్చావంటే మరీ రెచ్చిపోతారు. నిబ్బరంగా ఉండు' అని ధైర్యం చెప్పినవాడు నీలకంఠం.

ఇప్పుడూ నీలకంఠమే వారికి అండా ఆసరా అయ్యాడు. తనే పదిమంది బంధువుల పెట్టుగా విశ్వేశ్వరంగారికి తోడుగా నిలబడి మనుషుల్ని కుదిర్చి ఎలాగో అంత్యక్రియలు అయిందనిపించాడు.

★ ★ ★

'ఒక మంత్రం లేదు... కర్మకాండ లేదు- అనాథప్రేతంలా పూడ్చిపెట్టి వచ్చాం. తలారా స్నానంచేసి రుణం తీరిందనుకుంటున్నాం... ఎలాంటి తల్లిదండ్రులం మేము' దిగాలుగా కూర్చున్నారు విశ్వేశ్వరంగారు. కూతురి దినకార్యం శాస్త్రోక్తంగా జరపనందుకు చాలా విచారంగా ఉందాయనకి. ఆ బాధ ఆయన్ని తినేస్తోంది.

'బుద్ధిపూర్వకంగా కాకపోయినా పాప కూపంలో మునిగితేలింది తన కూతురు. తనువుకు అంటిన ఆ పంకిలం ఆత్మకు అంటకుండా ఉంటుందా? ఆ పాప ప్రక్షాళనం కానిదే ఆ ఆత్మకు శాంతెలా చేకూరుతుంది? తండ్రి తను. సశరీరుడై ఉన్నాడు. తన బిడ్డ పాప పరిహారం గురించి ఆలోచించవద్దా? ఆ బిడ్డనంటిన కళ్మలాన్ని తొలగించి ఉత్తమ గతులు కల్పించే మార్గం వెతకవద్దా?' ఏదో చేయాలి, ఏదైనా చేయాలి... అనే ఆలోచనలతో ఆయన తలంతా వేడెక్కిపోతోంది.

నీలకంఠానికి ఇలాంటి నమ్మకాలు తక్కువ. అలా అని ఎవరి విశ్వాసాలనీ కాదనడు. 'ఎవరి సొంత ఉద్దేశాలు వాళ్ళకుంటాయి' అనుకుంటాడు. ఖండించగల సత్తా లోపించినప్పుడు కలిగే ఉదాసీనత అది.

పాపం... విశ్వేశ్వరంగారి ముఖం చూస్తే జాలేస్తోందతనికి. "పద విశ్వం... అలా గుడిదాకా వెళ్దాం" లేవదీశాడాయన్ని.

ముందస్తుగా పురోహితుల్ని కలిశారు. 'మాకు విద్య నేర్పినవారు... శాస్త్రాలన్నీ తిరగేసిన పండితోత్తములు. వారికి తెలియని శాస్త్ర విశేషమంటూ లేదు' అంటే వారి గురువులనీ కలిశారు. వారింకోచోటు సూచించి అక్కడ ఫలితముండవచ్చంటే అక్కడికీ వెళ్ళారు.

"పుణ్యం సంపాయించేందుకో, తీరని కోరికలేమన్నా ఉంటే అవి తీర్చుకునేటందుకో అయితే పూజలూ, వ్రతాలూ, నోములూ వగైరా వగైరా చాలానే ఉన్నాయి. అవైతే, మేము చేయించగలం. కానీ, ఇలాంటి పాప నాశకర క్రతువులు చేయించుకోవాలనుకునేవాళ్ళూ చేయించగలవాళ్ళూ చాలా అరుదు" అన్నారు ఒకరు.

"పసుపునీళ్ళూ ఆవు పంచితంతో మైలపడ్డ ఇల్లు శుద్ధిచేసినట్టు ఏదో చిన్న పరిహారంచేసి ఒక పతిత జన్మాంతర మార్గం సుగమం చేయాలనుకుంటున్నారా, అసాధ్యం" అన్నారు ఒకరు.

"ఎందుకు లేదూ... పంచమహాపాతకాలకూ విరుగుడుంది. వాటి విధులూ, విధానాలూ వేరేగా ఉంటాయి. యజ్ఞాలూ, యాగాలూ, దానాలూ, జపాలూ, తపాలూ... అబ్బో, చాలా తతంగాలుంటాయి. వాటికి లక్షల్లో ఖర్చు. అల్పుడివి, అర్భకుడివి... తట్టుకోలేవు" పిచ్చుకని గండభేరుండం చూసినట్టు చూశాడు ఇంకో మహానుభావుడు.

నిస్సహాయత మూలంగా కలుగుతోన్న బలహీనత. విశ్వేశ్వరంగారి శరీరం తూలింది. భుజం చుట్టూరా చేయి వేశాడు నీలకంఠం. ఉసూరుమంటూ వెనక్కి తిరిగారిద్దరూ.

"ఇలా రండి నాయనా" ఎవరిదో పిలుపు.

అటుకేసి తిరిగారు. ఆలయం మండపంలో ఒక స్తంభానికి ఆనుకుని బాసింపట్టు వేసుకు కూర్చున్నాడాయన. వీరటు చూడగానే 'రండి' అంటూ మరోసారి చేత్తో సైగ చేశారు. వెళ్ళారు.

కాషాయాంబరం... తెల్లని గడ్డం... ఆచ్ఛాదనంలేని భుజం మీద యజ్ఞోపవీతం. వేలిలో ఆగకుండా తిరుగుతోన్న రుద్రాక్ష తావళం. నుదుటి ముడతల్లో అనుభవం పండిన జాడలు.

గౌరవం కలిగింది. తనకో పరిష్కారం దొర

కవచ్చున్న ఆశ కలిగింది. నమస్కారం చేస్తూ కూర్చున్నారు.

పెదవులు కదపబోయాడు నీలకంఠం. వారించాడాయన. "ఇందాకట్నుంచీ అన్నీ వింటూనే ఉన్నాన్నాయనా" అన్నారు.

తల దించుకున్నారు విశ్వేశ్వరంగారు. "పైకి చెప్పుకోలేని రుగ్మతయినా వైద్యుడి దగ్గర దాచి ప్రయోజనమేముంది స్వామీ! సిగ్గుగా ఉన్నా చెప్పుకోక తప్పలేదు" అన్నారు దీనంగా. "నా కూతురు చెడిపోయింది. పాపం అంటించుకుని మరీ ఈ లోకంనుంచి వెళ్ళిపోయింది. దాని ఆత్మకన్నా ఆ కళంకం నుంచి విముక్తి కలిగించాలని నా ఆరాటం. కానీ, అది తీరే దారి నా తాహతుకి మించిన దయిపోయింది. అదీ నా బాధ స్వామీ" అన్నారు ఆవేదనగా.

ఆయన చిరునవ్వు నవ్వారు. "నేనూ పెద్దగా శాస్త్రాలు చదివినవాణ్ణి కాదు. కానీ, ఇది మాత్రం ఊరికే నెరవలేదు" అన్నారు గడ్డాన్ని పట్టుకు చూపుతూ. "ఆ సాహసంతోటే నాకు తోచింది చెబుదామనిపించి పిలిచాను" అన్నారు. కొంచెం ఆగి, "నీ శక్తికి మించినది ఆచరించమని ఏ శాస్త్రమూ చెప్పుండదని నా నమ్మకం" అంటూ తిరిగి ఆగారు.

ఏమి చెప్పబోతారా అన్నట్టు ఆత్రంగా చూశారు విశ్వేశ్వరంగారు.


"సరే, ఏది పాపం... ఏది పుణ్యం అనే విషయం గురించి నేను చర్చించను. జీవి చేసిన పాపం ఆత్మకు అంటుతుందా లేదా అన్న మీమాంస కూడా మనకొద్దు. నువ్వు నమ్మే విశ్వాసాల ప్రకారమే ఆలోచిద్దాం. నీ కుమార్తె పాపం చేసిందని నువ్వెందుకను కుంటున్నావో నాకర్థం కావటంలేదు. అది పాపం కాదయ్యా- బాల్య చాపల్యంతో చేసిన చిన్న పొరపాటు. తన తప్పు తెలుసుకుంది. పశ్చాత్తాపపడింది. రెట్టింపుగా శిక్ష కూడా అనుభవించేసింది. వెళ్ళిపోయింది. ఇక ఆ అమ్మాయికి పాపమెక్కడ మిగిలింది? మరి పాపమే లేనప్పుడు ప్రాయశ్చిత్తమెందుకు చెప్పు? నేను చెబుతున్నది నిజం. నువ్వే పరిహారమూ చేయనక్కరలేదు" అన్నారు దృఢంగా. విశ్వేశ్వరంగారి మొహంలో ఇంకా ఏ కాస్తో తటపటాయింపు మిగిలుండటం చూసి, "నీకింకా అనుమానమున్నట్టయితే ఓ పని చెయ్యి. ఒక వందమంది నీ మేలు కోరే అయినవారికీ, బంధువులకీ సంతర్పణ చేయి. కడుపునిండా భోజనం చేసి, ఆ తృప్తితో దీవించినవారి దీవెనలలో గొప్ప మహత్తు ఉంటుంది సుమా. ఆ ఆశీర్వచనంతో, ఆలమటించే నీ బిడ్డ ఆత్మకు తప్పకుండా శాంతి కలుగుతుంది" అన్నారు, నెమ్మదిగానే అయినా స్పష్టంగా.

ఎదుటివారి బాధ చూడలేని దయార్ద్ర హృదయంతో ఆయన చెబుతున్న మాటలు విశ్వేశ్వరంగారి మనసుకు చాలా నచ్చాయి. కీకారణ్యంలో దారితప్పినవాడికి బయటకు వేరే బాట కనిపించినట్టుగా ఉంది. ఆయన మొహం తేటపడింది.

నొప్పించకుండానే ఒప్పించి మిత్రుని చింత తొలగించిన ఆ గొప్పతనానికి చేతులెత్తి నమస్కరించాడు నీలకంఠం.

★ ★ ★

విశ్వేశ్వరంగారు చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆరోజు పొద్దుటే దేవాలయానికి వెళ్ళారు. వినాయకుడికి అష్టోత్తరమూ, శివుడికి అభిషేకమూ చేయించి వచ్చారు. ఇంటి ముంగిట్లోనూ, పెరట్లోనూ షామియానాలు వేయించారు. పెద్దసైజు గ్యాస్‌స్టౌలూ, పాత్ర సామానూ గట్రా తెప్పించారు. వంటక్కావాల్సిన సంబారాలన్నీ నీలకంఠం ఖరీదు చేసి తెచ్చేశాడు. తనవంతు సాయంగా ముందస్తుగానే అరుంధతమ్మ ముక్కుపీ చెవులవీ... మంగళ సూత్రం మినహాగా ఒంటిమీదున్న ఆభరణాలన్నీ ఒలిచి భర్త చేతిలో పోసింది. చక్కగా చేతులనిండా మట్టిగాజులూ, మెళ్ళో పసుపు



తాడూ వేసుకుని వంటలు పర్యవేక్షిస్తోంది.

వారంక్రితమే బంధువులందరికీ ఉత్తరాలు రాశారు విశ్వేశ్వరంగారు. ఊళ్ళో ఉన్న చుట్టాల్నీ, స్నేహితుల్నీ, తెలిసినవాళ్ళనీ స్వయంగా వెళ్ళి పిలిచారు. "దయచేసి నా కూతురు చేసిన తప్పుని క్షమించి, మా ఇంట్లో భోంచేసి వెళ్ళండి. మీ క్షమా, సానుభూతీ నా బిడ్డ ఆత్మకు శాంతి నిస్తాయి. మీ ఆశీస్సులు ఏ ఆటంకమూ లేకుండా దాన్ని పుణ్యలోకాలకు చేరుస్తాయి" అని చేతులు మోడ్చి వేడుకున్నారు. ప్రాధేయపడ్డారు.

వాళ్ళందరూ సానుకూలంగా స్పందించినట్లే అగుపడింది మరి.

అపర్ణాహం దగ్గరపడుతోంది. కూరలూ, పచ్చళ్ళూ నాలుగురకాల పిండివంటలతో వంట పూర్తయింది. భోజన సమయం మించుతోంది. కానీ, వస్తామని మాటిచ్చినవారి పత్తాలేదే!

కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకీ బయటకూ తిరుగుతున్నారు విశ్వేశ్వరంగారు. దారితప్పి పొరపాటున వచ్చిన ఒకరిద్దరూ కూడా ఖాళీగా వెలివేసినట్టున్న ఇంటి వాతావరణం చూసి ఇప్పుడే వస్తామంటూ తప్పుకున్నారు.

హఠాత్తుగా ఓ గాలివార్త గాలిగా వచ్చి చెవుల్లో దూరింది. 'తిలా పాపం తలా పిడికెడూ అనీ- చెడినదాని పేరుమీద అన్నం తిని దాని పాపం తలా కాస్తా పంచుకోటానికి మనమేమన్నా పిచ్చివాళ్ళమా' అన్నారట ఎవరో.

స్థాణువైపోయారు విశ్వేశ్వరంగారు. 'ఎలాటి అభియోగం అది' - మనసంతా దిగులు... శూన్యం.

"దాని జన్మకిక ముక్తిలేదు, మోక్షం లేదు. ఇదంతా మన ప్రారబ్ధం" నెత్తి మొత్తుకుంటోంది అరుంధతమ్మ.

దిక్కుతోచనట్టు కూర్చున్న విశ్వేశ్వరంగారి దగ్గరకు వచ్చాడు నీలకంఠం. "భోక్తలు మన దగ్గరకు రాకపోతే మనమే వాళ్ళ దగ్గరకు వెళ్ళాలి మరి. పద... బండిలో అన్నీ పెట్టించేశాను" అన్నాడు అనునయంగా.

రెక్కపట్టుకు లేపి నడిపిస్తున్న నీలకంఠంకేసి 'మతిపోయిందా' అన్నట్టు చూశారు విశ్వేశ్వరంగారు.

నిజంగానే వండిన పాత్రలన్నీ మినీ వ్యాన్‌లో సర్దించేశాడు నీలకంఠం. విశ్వేశ్వరంగారు అయోమయంగానే వ్యాన్ ఎక్కి నీలకంఠం పక్కన కూర్చున్నారు. వ్యాన్ బయలుదేరింది. గాంధీజీ అనాథ శరణాలయం ముందు ఆగింది.

శరణాలయంలోంచీ, దానికి అనుబంధంగా ఆ పక్కనే ఉన్న వృద్ధుల ఆశ్రమం నుంచీ నూరూ నూటయాభై మంది శరణాగతులూ, వాటికి సంబంధించిన ఉద్యోగులూ బిలబిలమంటూ బయటికి వచ్చారు. శ్రద్ధగా, బాధ్యతగా చురుగ్గా పాత్రల్ని దింపారు. పంక్తులుగా తీరి కూర్చున్నారు. క్రమశిక్షణగా వడ్డించుకున్నారు. సంతృప్తిగా పిసరు వృథా కానీయకుండా భోంచేశారు.

ఈ ఏర్పాటూ అదీ అంతా కలగా ఉంది విశ్వేశ్వరంగారికి. అర్తులూ, అనాథలూ అయినవారి వదనాల్లో ఎంత వెలుగు! అనుకోకుండా ఇంత షడ్రసోపేతమైన భోజనం లభించినందుకు ఎంత సంతోషం! దేవుడి ప్రసాదం తీసుకుంటున్నట్టు ఎంత భక్తి! కడుపు నిండినట్టయింది విశ్వేశ్వరంగారికి. తిని పొమ్మని బతిమలాడితే వద్దుపొమ్మని తిరస్కరించిన తనవాళ్ళూ అనుకున్న బంధువులకంటే ఎంతో ప్రియంగా అరుదుగా దొరికిన అమృతంలా ఆరగిస్తున్న ఆ దీనులూ, నిర్భాగ్యులే తనకు అసలైన ఆత్మీయులు అనిపించిందాయనకి.

నీలకంఠం ఏమి చెప్పాడో తెలీదు- చివరగా అందరూ వరుసలుగా నిలబడి చేతులు జోడించి ఆకాశం వైపు చూస్తూ, "యమునమ్మ ఆత్మకు శాంతి కలిగించు స్వామీ" అంటూ ముక్తకంఠంతో హృదయపూర్వకంగా ఎలుగెత్తి ప్రార్థించారు.

ఉద్వేగంతో విశ్వేశ్వరంగారి కళ్ళు చెమ్మగిల్లాయి. ఆ నీటిపొర వెనుక స్పష్టాస్పష్టంగా కనిపిస్తోంది- తెల్లటి రెక్కల రథంపైన తన యమున వెలుగు రూపంలో వెడుతోంది భగవంతునిలో లీనం కావటానికి. ★